క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న గజానన్ రాజు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భవన నిర్మాణ కార్మిక జైనథ్ మండల నూతన కమిటీని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి గజనన్ రాజు సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా వినాకర్, ఉపాధ్యక్షుడిగా గేడం పొచ్చిరాం, ప్రధాన కార్యదర్శిగా సురేశ్‌చౌహాన్, మనోహర్ రఫీ, అశోక్ రతన్, నరేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి గజనన్ రాజు మాట్లాడుతూ కార్మికులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వారికి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఉర్సు ఉత్సవాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా(టి)లో రాజన్షా వలి దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల 4 ప్రారంభం కాగా ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి గాయకులు రాజన్ షా వలిని కీర్తిస్తూ ఖవ్వాలి చేశారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఉత్సవాల చివరి రోజు దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు అష్రఫ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశమైన జుగ్నాక్ వంశీయులు

ఇంద్రవెల్లి: జుగ్నాక్ వంశీయుల పెర్సపేన్(పెద్ద దేవుడి)ఆలయాభివృద్ధికి కృషి చేద్దామని జుగ్నాక్ వంశం పెద్దలు జుగ్నాక్ మహదు, జైతు, మానిక్‌రావ్‌లు అన్నారు. ఆదివారం మండలంలోని పొల్లుగూడలో ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయులు సమావేశమయ్యారు. ఆలయాభివృద్ధి, నిధుల సేకరణపై చర్చించారు. కార్యక్రమంలో జుగ్నాక్ వంశీయులు కాశీరాం, భారత్, జాలిం, లింబారావ్, ఆత్రం శంకర్, కోరెంగా లింగు, జుగాదివార్, సిడాం జైతు, భుజంగ్ రావ్ పాల్గొన్నారు.

కారు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన మహ్మద్ ఆహ్మద్ కారును అదే కాలనీకి చెందిన ఫరుతి ఖాన్ శనివారం బండరాయితో ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా ఎస్సై విష్ణు ప్రకాష్ కేసు నమోదు చేశారు. పాత కక్ష్యలతో తన వాహనాన్ని ధ్వంసం చేసిన్నట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ఆవు మృతి

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలోని స్టోన్ క్రేషర్ ములమలుపు వద్ద ఆదివారం లారీ ఢీకొని సుంకిడి గ్రామానికి చెందిన విట్టల్ అనే రైతుకు చెందిన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.ఆవు విలువ దాదాపు రూ. 30 వేల వరకు ఉంటుందన్నారు. వెంటనే రైతు గ్రామస్తులు, లారీని గ్రామస్తులు గ్రామ సమీపంలో అడ్డుకోని, బాధిత రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి ఎస్సై అంజమ్మ చేరుకొని అతివేగంగా వాహనాలు నడపవద్దని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

కారుబోల్తా.. 8 మందికి గాయాలు

గుడిహత్నూర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్తుండగా కారు బోల్తాపడిన ఘటనలో 8 మందికి గాయాలైనట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు ఇన్నోవా కారులో 8మంది బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున 4గంటల సమయంలో స్థానిక బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు ఎదురుగా జాతీయ రహదారి నుంచి అదుపుతప్పి సర్వీస్‌రోడ్డుపై కారు బోల్తా పడింది. కారులో ఉన్న 8 మందికి గాయాలయ్యాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీ వద్ద కిషన్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. వాహనం ఢీకొట్టడంతో కిషన్ అక్కడికక్కడే కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే బోథ్‌లోని సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్ తరలించారు.

కందులు అమ్ముకునేదెట్లా..?

- ఆందోళనలో రైతులు
- అధికారుల తీరుపై మండిపాటు
- స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్

ఇచ్చోడ: ప్రధాన మార్కెట్ కేంద్రమైన ఇచ్చోడలో ఈఏడాది కందుల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ఎత్తివేశారు. దీంతో అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. ఇచ్చోడ మార్కెట్ పరిధిలోకి ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ మండలాలు వస్తాయి. మూడు మండలాల రైతులు పండించిన కందిని ప్రతీ ఏడాది ఇచ్చోడ మార్కెట్ కొనుగోళు కేంద్రంలో విక్రయిస్తారు. కానీ ఈఏడాది కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేయడంతో ఇక్కడి రైతులు విస్మయం చెందుతున్నారు.

అదనపు భారం..

ప్రధాన మార్కెట్ కేంద్రమైన ఇచ్చోడలో కందుల కొనుగోలు కేంద్రం ఎత్తివేతపై అధికారులు తీరుతో ఇక్కడి రైతులు విస్మయం చెందుతున్నారు. మూడు మండలాల్లో ఈఏడాది దాదాపుగా 10 వేల ఎకరాల్లో కంది సాగు చేశారు. 50 వేల క్వింటాళ్ల కందులు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. పండించిన పంటను దూరప్రాంతాల్లో ఉన్న కేంద్రాలకు తరలించాలంటే రైతులపై మరింత భారం పడనుంది.



ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

రైతుల మండిపాటు..

కందుల కొనుగోళ్ల కేంద్రాల్లో ప్రధాన కేంద్రమైన ఇచ్చోడ కేంద్రాన్ని అధికారులు ఎత్తివేయడం పట్ల రైతులు మండిపడుతున్నారు. ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్ మండలాల రైతులు తమ పండించిన కంది పంటను విక్రయించుకోవడానికి బోథ్, ఆదిలాబాద్ కేంద్రాలకు తీసుకెవెళ్లాలంటే రవాణా చార్జీలు తడిసి మోపెడవుతాయి. ఇచ్చోడ మార్కెట్‌లో కందుల కొనుగోళ్ల కేంద్రం ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

స్థానికంగా ఏర్పాటు చేయాలి



ఇచ్చోడ మార్కెట్‌లో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను సైతం దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించడం కష్టంగా మారుతుంది.

– కాటొపెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, ఇచ్చోడ

చర్యలు తీసుకోవాలి



మూడు మండలాలకు మధ్యలో ఉన్న ఇచ్చోడ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రం ఎత్తివేతపై అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

– బియ్యల మల్లేష్, రైతు, సిరికొండ

రైతులపై అదనపు భారం



ఇచ్చోడ మార్కెట్‌లో కందుల కొనుగోలు కేంద్రం లేక పోవడంతో రైతులపై అదనపు భారం పడనుంది. ఇతర ప్రాంతాలకు కందులు తీసుకెళ్లాలంటే ట్రాన్స్‌పోర్ట్‌తో అదనపు భారం పడనుంది.

– అంకుష్ అప్పా, గుడిహత్నూర్

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

బజార్‌హత్నూర్: మండలంలోని బలన్‌పూర్, కొత్తపల్లి, బోస్రా గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్, సీడీపీ, ఎస్‌డీఫ్ నిధుల ద్వారా త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తానన్నారు. కొలారి, కొలాంగూడ గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో గవ్వల సాయి చైతన్య, గోట్ముకులే ఆకాశ్, నిరంజన్, అవదూత్, ప్రకాశ్, రాజారాం, కవీందర్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మహానందికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ పరిధిలోని నందిగామలో నూతనంగా నిర్మించిన శివాలయంలో గ్రామస్తులు మహానందికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాత ముడుపు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. నందిగామ గ్రామ ప్రాంతంలోని మహా శివాలయానికి చరిత్ర ఉందన్నారు. శివాలయ నిర్మాణం, విగ్ర ప్రతిష్ఠాపన అవకాశం లభించినందుకు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం నూతన శివాలయ నిర్మాణ ప్రారంభోత్సవం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించడం జరుగుతుందన్నారు. ముడుపు ప్రేమేందర్ రెడ్డి, ముడుపు మౌనిష్ రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

బేల: బేల గ్రామ పంచాయతీ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన బురాన్‌పూర్ రెవెన్యూ శివారులోని సర్వే నం.29/ఏలో అక్రమ లే అవుట్‌లోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడ శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కుమురం భీం కమ్యూనిటీ హాల్‌లో ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. అక్రమ నిర్మాణాలను పంచాయతీ శాఖ వారు తొలగించకపోతే ఉద్యమాలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు కొరంగే సోనేరావు, సిడాం నందకుమార్, ఆడ సంతోష్, నైతం సీతరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆడ శంకర్

జయంతి విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: ఈనెల 14న ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్ వద్ద ఆదివాసీ పర్ధాన్ సమాజ్ భవనంలో నిర్వహించే హీరాసుక జయంతిని విజయవంతం చేయాలని సంఘం నాయకులు ఆర్క ఖమ్ము, గేడం జ్ఞానేశ్వర్‌లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాజ్ పెద్దలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పర్ధాన్ సమాజ్ నాయకులు గేడం భారత్, కనక భీంరావ్, గేడం సోనేరావ్, కనక రజినికాంత్, సోయం మురహరి, సోయం రాందాస్, మడావి దత్తు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గెలుపు కోసం కృషి చేయాలి

ఆదిలాబాద్: కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. బీజేపీతోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల సంక్షేమానికి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కృషి చేస్తారన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం పట్టభద్రులు, ఉపాధ్యాయులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఢిల్లీలో బీజేపీ విజయం కార్యకర్తలు, నాయకుల్లో ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానంద్

స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

గుడిహత్నూర్: మండలంలోని చింతగూడ సమీపంలో గులాబ్ సింగ్ పార్కులో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన ఇతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తన చేనును పార్కుగా మార్చి ఆహ్లాదాన్ని పంచుతున్న గులాబ్‌సింగ్‌ను అభినందించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, బేర దేవన్న, గజానంద్ గిత్తే, జమీల్, ఇమ్రాన్, రాహుల్, మాధవ్, గఫార్, కేంద్రే మాధవ్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక బోధనలు అనుసరణీయం

బేల(జైనథ్): ఆధ్యాత్మిక సద్గురు దాదాజీ మహరాజ్ ఆధ్యాత్మిక బోధనలు అనుసరణీయం కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌన రెడ్డి అన్నారు. ఆదివారం జైనథ్ మండలంలోని నిరాల గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న దాదాజీ మహరాజ్ సప్తాహం ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొని, దాదాజీ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో నీటి కొరత

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- బకెట్లు పట్టుకొని బయటకు..
- పట్టించుకోని అధికారులు

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. అచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. గిరిజన విద్యార్థుల తలరాత మారడం లేదు. మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో మొత్తం 100 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రతీరోజు ఉదయం కాలకత్యాలతో పాటు స్నానాలు చేసేందుకు తాహసీల్దార్ కార్యాలయ సమీపంలోని చేతి పంపు వద్ద పడిగాపులు కాయాల్సి దుస్థితి. చేతి పంపు వద్ద అరుబయటే స్నానాలు, ముఖాలు కడుక్కుంటున్నారు. పాఠశాలలో వాటర్ ట్యాంకు ఉన్నా.. ఉపయోగం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరగంట మాత్రమే నీరు సరఫరా అవుతుందని వాపోతున్నారు. ఈ సమస్యలను ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి ఫలితం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో మరుగు దొడ్లు నిరుపయోగంగా మారాయి.

అరగంట మాత్రమే సరఫరా..

నార్నూర్, తాడిహత్నూర్, భీంపూర్ గ్రామాల్లోని ఆశ్రమ పాఠశాలలో నీటి కొరత తీవ్రంగా ఉంది. పాఠశాలలో విద్యార్థులు మిషన్ భగీరథ నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. భగీరథ నీరు రాని రోజు నీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటిని అరగంట కంటే ఎక్కువ సరఫరా కావడం లేదు. విద్యార్థులు పాఠశాల ఆవరణం నుంచి బయటకు వచ్చి స్నానాలు, ముఖాలు కడుకోవాల్సి పరిస్థితి. నీటి కోసం బయటకు వస్తున్న విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.



నీటి కోసం బయటకు వెళ్లిన విద్యార్థులు

చర్యలు తీసుకుంటాం

నార్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో నీటి సమస్య ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. మిషన్ భగీరథ నీటిపై ఆధారపడాల్సి ఉంది. నీటి సమస్యను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తాం. పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

– క్రాంతికుమార్, ఏటీడీవో ఉట్నూర్

బాజీరావు బాబా బోధనలు ఆచరణీయం

బేల: ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా బోధనలు ఆచరణీయమని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చప్రాల గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న బాజీరావు బాబా సప్తాహం వేడుకల ముగింపును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, హేమంత్, సాగర్, చంద్రకాంత్, స్వప్నిల్, తదితరులు పాల్గొన్నారు.



పల్లకి ఊరేగింపులో కాంగ్రెస్ నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం



తాంసి: కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004–05 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో నీటి సమస్య తీర్చడానికి రూ.15వేల విలువ గల మోటార్ పంపుసెట్‌ను అందించారు.

'ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి'

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సాజిదొద్దీన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తెలంగాణలో 420 హామీలతో పాటు ఆరు గ్యారంటీ పథకాలు వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రగల్బాలు పలికి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ కరెంటు, ఇండ్ల స్థలాలు అందిస్తామని దరఖాస్తులు ప్రజల నుంచి తీసుకొని ఒక్కటి కూడా పూర్తి చేయకుండా ప్రజలను మభ్యపెట్టిందన్నారు. సమావేశంలో నాయకులు అజయ్, ఇజ్జగిరి అశోక్, కుమ్ర రాజు, దాసరి రమేశ్, దయానంద్, ఆసిఫ్, షాదుల్ల, ఫేరోజ్, రాజ్ సిద్దార్థ్, ముఖిద్, ఆలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న గ్రామస్తులు

తాంసి: మండల కేంద్రంలోని పొచ్చమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతకు భక్తితో పూజలు చేశారు. అంతకుముందు మహిళలు, గ్రామస్తులు డప్పుచప్పుల తో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. ప్రజలు ఆయుఆరోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, నిర్వాహకులు రాములు, ఇప్ప రాము, కార్తీక్, నర్సింగ్, సంతోశ్ రెడ్డి, రామన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భైంసాటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘ భవనంలో పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన పలువురిని శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, నూతన పీఆర్సీ, ఏకీకృత సర్వీస్ నిబంధనలు, ఇతర సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాశ్, నరేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జైశివరాం, పుండలిక్, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, సలీం హైమద్‌ఖాన్, జమీల్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.